క్లుప్తంగా

నేడు మండలానికి రామానంద భారతి స్వామిజీ

రామాపురం: శ్రీ సౌభాగ్య భువనేశ్వరీ పీఠం విశాఖపట్నం పీఠాధిపతి శ్రీ రామానంద భారతి స్వామిజీ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నల్లగుట్టపల్లె గ్రామంలోని సద్గురు దర్గా మాతాజీ, దర్గాస్వామిజీ ఆశ్రమానికి విచ్చేయుచున్నానట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ పాల్గొని సద్గురువుల అనుగ్రహ ఆశీస్సుల పొందవాల్సిందిగా తెలియజేశారు.

తిరుమలకు భక్తుల మహాపాదయాత్ర



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సుండుపల్లె: గోవింద నామస్మరణలతో ఆరవ తిరుమల మహా పాదయాత్రను రాజంపేట నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడు, చిన్నగొల్లపల్లి సర్పంచ్ రామాజయచంద్ర ప్రారంభించారు. మంగళవారం ఉదయాన్నే చిన్నగొల్లపల్లి గ్రామ సమీపంలోని మర్రిచెట్టు దగ్గర ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు ముందుకు సాగారు. గురువారం శ్రీవారి మెట్లు మార్గం ద్వారా తిరుమలకు చేరుకుని స్వామి వారి దర్శనం చేసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

పౌష్టికాహార లోపం ఉండకూడదు

సుండుపల్లె: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మండల ఆశ వర్కర్ల సమావేశాన్ని వైద్యాధికారిణి ఫర్హానాఖానం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలలో ఒకసారి ఆశాడే ఉంటుందని, ఇందులో భాగంగా డెలివరీ కేసులు, కాన్పుల వివరాలు, బాలింతలు, గర్భిణుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహార లోపం లేకుండా గ్రామాలలో ఇంటింటికీ తిరిగి అవగాహన పెంచాలన్నారు. షుగర్, బీపీతో పాటు క్యాన్సర్ స్కానింగ్ పాఠశాల విద్యార్థుల వివరాలను పూర్తి చేయాలన్నారు. టీబీ ఉన్న రోగులను గుర్తించి, హాస్పిటల్ వచ్చేలా అవగాహన పెంచి మందులను వాడించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ నోడల్ అధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా ఊట ధ్వంసం



నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సుండుపల్లె: మండల పరిధిలోని కుప్పగుట్ట సమీపంలో బాహుదా నది ఒడ్డున 100 లీటర్ల నాటుసారా ఊటను ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు మంగళవారం ధ్వంసం చేశారు. అక్కడ నాటుసారాను తయారుచేస్తున్న నాగలేశ్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ బిడి నాయక్, కానిస్టేబుల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సానే శేఖర్

పుల్లంపేట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పుల్లంపేట పీహెచ్‌సీవైద్యాధికారి డాక్టర్ సానే శేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే సమావేశం సందర్భంగా మహిళా ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాలికలకు 21 సంవత్సరాలు, పురుషులకు 25 ఏళ్లు వచ్చిన తరువాత వివాహం చేయాలని, అంతకంటే తక్కువ వయస్సులో వివాహం చేయడం నేరమన్నారు. అలాగే గర్భవతులను తొందరగా నమోదు చేయాలని తద్వారా వారికి రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మనోజ్ చంద్ర, పీహెచ్ఎన్ ఆరోహరమ్మ, సిహెచ్‌ఓ రాజ, సూపర్‌వైజర్లు కుమారి, మహేష్, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై క్షేత్ర సందర్శన

సిద్దవటం: వివిధ చీడ, పీడల గుర్తింపు, సస్యరక్షణ చర్యలుపై క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని మంగళవారం కడప జిల్లా ఊటుకూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.అంకయ్యకుమార్, బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. ఈసందర్భంగా వారు సిద్దవటం మండలంలోని జంగాలపల్లెకు సంబంధించిన రైతు రమేష్ వరి పొలాన్ని సందర్శించారు. అధికారులు మాట్లాడుతూ రైతు ఆర్ఎన్ఆర్ 15048 వరి రకాన్ని 2 ఎకరాల్లో సాగు చేశారన్నారు. అలాగే ఎన్‌డిఎల్ ఆర్–7, ఎన్‌డిఎల్ఆర్–8 రకాల ప్రాధాన్యతను వివరించామన్నారు. వరిలో జింక్, పొటాష్ వాడకం తప్పనిసరి, కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దీని నివారణకు ఫ్లూ బెండమెయిడ్ లీటరు నీటికి 0.3 మిల్లీ లీటర్లు చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించామని పేర్కొన్నారు.

పాడికి శ్రేయస్కరం.. గడ్డి పెంపకం

- వేసవి దృష్టిలో ఉంచుకొని సాగు చేయాలంటున్న అధికారులు
- సబ్సిడీ కింద గడ్డి విత్తనాలు అందిస్తూ ప్రభుత్వం ప్రోత్సాహం

నియోజకవర్గాల వారీగా పశువుల వివరాలు

నియోజకవర్గం	ఆవులు	ఎనుములు
రాయచోటి	95,384	50,324
రాజంపేట	11,138	22,563
రైల్వేకోడూరు	6,604	25,855
మదనపల్లి	23,631	420
పీలేరు	53,229	589
తంబళ్ళపల్లి	68,167	1,406



కోడూరులో కొద్దిపాటి పొలంలో గడ్డిని సాగు చేస్తున్న రైతు

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో రైతులు పాడి పశువులను ఆధారంగా చేసుకొని చాలామంది రైతులు జీవనం సాగిస్తుంటారు. చాలా మంది గ్రామాలలో వ్యవసాయ పొలాలు, బీడు భూములు, చెరువులలో దొరికే పశుగ్రాసం (గడ్డి) పై ఆధారపడుతుంటారు. వేసవికాలంలో, వర్షాకాలంలో వీరు గడ్డి దొరక్క పాడిరైతులు నానా తంటాలు పడుతుంటారు. పాడి రైతులకు గడ్డి పెంపకం రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని రైతులు తమకు ఉన్న భూమిలో కొంత భూమిని పశుగ్రాసానికి కేటాయిస్తే మంచిది. ముఖ్యంగా పశుసంవర్ధక శాఖ అధికారులు సూచించిన ఆఫ్రికన్ టాల్ మెయిల్స్, సీఎస్‌హెచ్24, ఏపీడీఎం, కోవెరైటీ గడ్డి పెంచుకోవడం పాడిపశువులకు ఎంతో శ్రేయస్కరం. ఈ రకాలు నీటి ఎద్దడి తట్టుకొంటాయి, అదే కాకుండా పశుగ్రాసం మంచి దిగుబడి వస్తుంది. అలాగే పాడి పశువులకు పశుగ్రాసం అందుబాటులో ఉండి సమయం ప్రకారం మేత ఇవ్వవచ్చు. జిల్లావ్యాప్తంగా 6 నియోజకవర్గాలలో ప్రభుత్వ లెక్కల ప్రకారం అన్ని రకాల పశువులు సుమారు 3,59,310 వరకు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పశువులను రైతులు మేపలేక మాంసపు వ్యాపారులకు అమ్ముకొంటూ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

చిన్న కుటుంబాలకు పాడి పశువులే ఆధారం

అధికశాతం గ్రామాలలో చిన్న కుటుంబాలు పాడి పశువులపైనే ఆధారపడుతుంటారు. ముఖ్యంగా వేసవికాలం, వర్షాకాలంలో పశుగ్రాసం కొరత అధికంగా ఉంటుంది. దీంతో పాడిరైతులు ఇక్కట్లు పడాల్సిన పరిస్థితి. వర్షాకాలంలోనూ గడ్డి లభ్యం కాని పరిస్థితులు ఉంటాయని అలాంటి సమయాలలో కొంత భూమిలలో గడ్డిపెంపకం ఎంతో మేలు చేస్తుందని పశువైద్య అధికారులు సూచిస్తున్నారు. పశుపోషకులకు పశుగ్రాశం కొరత లేకుండా చేయడానికి పలు కార్యక్రమాలు చేస్తున్నా మారుమూల గ్రామాలలో ఇది కార్యాచరణ దాల్చడం లేదన్నారు.

పశుగ్రాసం పెంచడంవల్ల ఎంతో ఉపయోగం



గ్రామాలలో పశు పోషణకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. అందువల్ల కొంత మేర పశు దానా గడ్డి పెంచుతున్నా. స్థానిక అధికారుల సలహా మేరకు గడ్డి పెంచడం వల్ల వర్షాకాలం, వేసవికాలంలో గడ్డి ఇబ్బంది ఉండకుండా సమస్య అధికమిస్తాం. పాడి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాలి

– దేరంగుల ఈశ్వరమ్మ, చియ్యవరం వడ్డిపల్లి, రైల్వేకోడూరు మండలం

ప్రభుత్వ ప్రోత్సాహకం ఉండాలి



పశువులకు అన్ని కాలాలలో గడ్డి కోసం ఇబ్బందులు పడుతున్నాం. దీంతో కొంత భూమిలో గడ్డిపెంపకం మేలనే ఉద్దేశంతో గడ్డిపెంపకానికి సిద్ధమయ్యా. పాడి రైతులకు ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలి. పాలు ఎగుమతికి సహకరించి, ఉత్పత్తి ప్రోత్సాహకం ప్రతి లీటరుకు అదనంగా కొంత ఇస్తే బాగుంటుంది.

– ఎం.సుబ్బరాయుడు, పాడిరైతు, రాంనగర్, రాజంపేట మండలం

వేసవిలో పశుగ్రాస సమస్య అధికమించడానికి చర్యలు



రాబోయే వేసవి మే నెలలో పశుగ్రాస కొరత అధికమించడానికి చర్యలు తీసుకొంటున్నాం. ఇప్పటికే పాడి రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేసి, సాగుకు సహకరించాం. జిల్లాలో పశుగ్రాసానికి 1000 ఎకరాలు లక్ష్యంగా పెట్టుకొని ఉపాధి హామీ ద్వారా 100శాతం సబ్సిడీతో 800 ఎకరాలకు విత్తనాలు పంపిణీ చేసి ఉన్నాం. ఇంకా ఆసక్తి ఉన్న మధ్య తరహా రైతులు పశుగ్రాసానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఉన్న పొలంలో 10 శాతం గడ్డి పెంచుకొన్నా, లేక వ్యవసాయ యోగ్యం కాని భూములలో నీటి ఎద్దడికి తట్టుకొనే మొలకలు పెంచడం ఉపయోగకరం. అలాగే అధికారుల సలహాలు తీసుకోవాలి.

– డాక్టర్ గుణశేఖర్ పిళ్లై, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

పంట నమోదు చేసుకోండి



రామాపురం: మాట్లాడుతున్న ఏఓ నాగమణి



సిద్దవటం: ప్రొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న ఏఓ రమేష్‌రెడ్డి

రామాపురం: పంటలు సాగు చేసిన ప్రతి రైతు సేవా కేంద్రంలో తమ పంట నమోదు చేసుకొని ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి వై.నాగమణి పేర్కొన్నారు. మండలంలోని బండపల్లి, కుమ్మరపల్లె గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతు మీసేవ కేంద్రంలో ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. భూమి కలిగిన ప్రతి రైతు వ్యవసాయ శాఖ ద్వారా పథకాలు పొందాలంటే రైతులు తమ పంటలను రైతు సేవా కేంద్రంలో తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. రైతులు రైతు సేవా కేంద్రంలో పట్టాదారు పాసు పుస్తకాలు, ఆధార్‌కార్డు, ఆధార్ లింకు ఫోన్‌నెంబరును వెంట తీసుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రపంజని, సిబ్బంది హరీష్, మంజుల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

సిద్దవటం: టక్కోలు రైతుసేవా కేంద్రం పరిధిలోని ఖాజీపల్లె, లింగంపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించామని వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం క్షేత్రసందర్శన కార్యక్రమాన్ని చేట్టామని, అనంతరం గ్రామసభ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రొద్దుతిరుగుడు, నువ్వులు, వేరుశనగ పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యలు సకాలంలో తీసుకోవాలని తెలిపామన్నారు. తరువాత టక్కోలు రైతుసేవా కేంద్రంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. జింక్ లోపం నివారణకు చిలేటెడ్ జింక్ 2 గ్రాములు, ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. చౌడుభూముల యాజమాన్యం, సాగునీటి పరీక్ష ప్రాధాన్యతను వివరించామన్నారు. యూరియా వినియోగాన్ని తగ్గించండి, పొటాష్ ఎరువును వేయాలని తెలిపామన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు వంశీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పండుఈగ నివారణకు కవర్లు వాడాలి

లక్కిరెడ్డిపల్లి: మామిడిలో పండు ఈగ నివారణకు కవర్లు వినియోగంపై మండలంలోని దప్పేపల్లి, కోనంపేట గ్రామంలో మంగళవారం మామిడి రైతులకు ఉద్యాన అధికారిణి (హెచ్ఓ) నాగమణి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి కాయ పెద్ద నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు కాయలకు కవర్లు వాడటం వలన నాణ్యమైన కాయలను పొంది ఎగుమతి చేయడం వలన అధిక ధర లభిస్తుందని చెప్పారు. అలాగే పండు ఈగ (ఊజీగ) కాయ తొలుచు పురుగు, వివిధ తెగుళ్లు, అధిక గాలుల నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. మామిడి కాయలను ఎక్కువకాలం చెట్టుపై నిల్వ చేసి మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవడానికి వీలవుతుందని వివరించారు. పురుగు మందుల వాడకం కోసం రైతు పెట్టే ఖర్చు చాలా వరకు తగ్గించుకోవచ్చన్నారు. మామిడి కాయలకు కవర్లు ఎకరాకు 4 వేల కవర్లు అవసరం ఉంటుందని, ఒక ఎకరాకు కవర్లు కట్టుకోవడానికి రైతుకు 50శాతం సబ్సిడీతో రూ. 4 వేలు ఉద్యానశాఖ ద్వారా సబ్సిడీ వర్తిస్తుందని, ఒక రైతుకు అత్యధికంగా పదివేల కవర్లు ఇవ్వనున్నట్టు తెలియజేశారు. మామిడి రైతులు తమ గ్రామ రైతు సేవా కేంద్రం సహాయకులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రమేష్ బాబు రావు, రైతు సేవాకేంద్ర సిబ్బంది హసీన, హరిత, రైతులు పాల్గొన్నారు.

అలరించిన సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు



సైన్స్ ఫేయిర్‌ను ప్రారంభించిన అపుస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వి. రమణారెడ్డి

సిద్దవటం: మండల కేంద్రంలోని శ్రీ సాయి హైస్కూల్ విద్యార్థులు తయారు చేసిన వర్కింగ్ మోడల్ ప్రాజెక్టు సైన్స్‌ఫెయిర్ చూపరులను ఎంతో అలరించాయి. ఈ సందర్భంగా శ్రీ సాయి హైస్కూల్‌లో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను మంగళవారం అపుస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వి.రమణారెడ్డి, కడప శ్రీనివాస ఆసుపత్రి అధినేత బైన శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇందులో పాఠశాలలోని విద్యార్థులు తయారు చేసిన దాదాపు 150 వర్కింగ్ మోడల్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. హైడ్రాలిక్ బ్రిడ్జి, డేనైట్ అమెరికా అండ్ ఇండియా వర్కింగ్ మోడల్, సీజన్స్, వాటర్ ప్యూరిఫికేషన్, రైన్ వాటర్ హార్వెస్టింగ్, బజర్‌గేమ్, మైక్రోస్కోప్, కూలింగ్ సిస్టం, హార్ట్ బ్లడ్ సర్క్యులేషన్, అడవులను నరకడం వల్ల వచ్చే నష్టాలు, మరికొని ప్రాజెక్టులు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పోలు వెంకటసుబ్బయ్య, జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది శివంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగసుబ్బారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ రేవతీ దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ మధుసూదన్ రావు

రాయచోటి: జిల్లాలో ఆధార్ నమోదు పెంచేందుకు సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్ఓ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ సమీకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఆధార్ నమోదు ప్రగతి, 5 ఏళ్లలోపు పిల్లల నమోదు, మొబైల్ బయోమెట్రిక్ యూనిట్లు, నమోదు సందర్భంగా తిరస్కరణకు గురవుతున్న అంశాలు, సాంకేతిక సమస్యలు తదితరాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆధార్ రీజినల్ కార్యాలయ సహాయ మేనేజర్ కె.దామోదర్ సమావేశంలో వివరించారు. జిల్లాలో సచివాలయాలు, పోస్టాఫీసులు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్, ఇతరత్రా మొత్తంగా 212 ఆధార్ నమోదు కేంద్రాలు ఉన్నాయని డీఆర్ఓ తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, డీఈఓ సుబ్రమణ్యం, ఐసీడీఎస్ ఇన్‌చార్జి అధికారి రమాదేవి, ఎల్‌డీఎం ఆంజనేయులు, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులు, వివిధ బ్యాంకర్లు పాల్గొన్నారు.

ముగిసిన పోలేరమ్మ జాతర



బోనాలతో అమ్మవారి ఆలయానికి వస్తున్న భక్తులు

గాలివీడు: మండల కేంద్రంలోని శెట్టివారిపల్లెలో గత రెండు రోజులుగా జరుగుతున్న పోలేరమ్మ జాతర మంగళవారం అసాధుని కథతో ముగిసింది. సద్దల కూడు నైవేద్యంతో జాతరకు అంకురార్పణ చేసిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ మధ్య భక్తులు విశేష పూజలు, అభిషేకాలు, చాందినీబండ్ల గ్రామోత్సవంతో నిండు తిరునాలగా మారింది. మంగళవారం ఉదయం స్త్రీలు బోనాలను సమర్పించుకున్నారు. చాందినీబండ్లు, కోలాటాలు, చెక్కభజనలు, ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి.

మహిళలను గౌరవించాలి




సిద్దవటం 1వ వార్డు అంగన్‌వాడీ సెంటర్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణిరాజకుమారి

సిద్దవటం: అన్ని రంగాలలో రాణిస్తున్న మహిళలను గౌరవించాలని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని 1వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళలను గౌరవించాలని, బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. మహిళలు అన్ని రంగాలలో నైపుణ్యత సాధించే విధంగా కృషి చేసి వారికి తోడ్పడాలన్నారు. స్త్రీ గొప్పతనాన్ని చాటి చెప్పే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, పి.కొత్తపల్లె పిహెచ్‌సీ సూపర్‌వైజర్‌లు మౌలాలీ, పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు శారద, వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

రాయచోటి: ఇంటర్మీడియెట్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలను అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 49 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. పరీక్షలలో 15921 మంది విద్యార్థులకు గాను 15006 మంది హాజరు కాగా.. 915 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ కృష్ణయ్య తెలిపారు. రెగ్యులర్ పరీక్షలలో 14639 మంది విద్యార్థులకు గాను 13904 మంది పరీక్షలకు హాజరు కాగా, ఒకేషనల్ పరీక్షలకు 1282 మంది విద్యార్థులకు గాను 1102 మంది హాజరయ్యారు. 180 మంది పరీక్షకు హాజరు కాలేదు. పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు తగిన మౌలిక వసతులను కల్పించామని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి ఎం.కృష్ణయ్య తెలిపారు.

రాయచోటి ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వరరెడ్డి



ఏకగ్రీవంగా ఎన్నికైన రాయచోటి తాలుకా కార్యవర్గం

రాయచోటి అర్బన్: రాయచోటి ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడిగా దండు వెంకటేశ్వరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్‌జీఓ సంఘ సభా భవనంలో మంగళవారం రాయచోటి తాలుకా ఎన్‌జీఓ యూనిట్‌కు ఎన్నికలు జరిగాయి. ఎన్నికల పర్యవేక్షకులుగా కడప ఎన్‌జీఓ సంఘం నేతలు శ్రీనివాసులు, నిత్యపూజయ్యలు వ్యవహరించారు. సంఘం కార్యవర్గం ఎంపికలో ఒక్కో పోస్టుకు ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. సంఘం అధ్యక్షుడుగా డి.వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శిగా సి.శ్రీనివాసులు, కోశాధికారిగా బి.దేవేంద్ర, అసోసియేట్ అధ్యక్షుడుగా పి.మహాదేవ, ఉపాధ్యక్షులుగా కె.ప్రమీలమ్మ, పి.మణికంఠ, ఎ.వనజ, కె.హరిప్రసాద్, బి.రవిశంకర్, ఎస్.వెంకటశివారెడ్డిలు ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా ఎం. ప్రతిభాకుమారి, ఎం.వరలక్ష్మి, ఎస్.మహమ్మద్‌అలీ, జి.పార్వతమ్మ, డీఈసీలు ఎం.రఘునాథనాయక్, ఎస్.రామక్రిష్ణయాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డి.అనసూయదేవిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలతతో వ్యవహరించి, ఉద్యోగులకు రావలసిన డీఏ, పీఆర్‌సీ బకాయిలు సకాలంలో అందేలా పోరాటాన్ని కొనసాగిస్తామంటూ చెప్పారు.

వీధి దీపాలు వెలగవా?

రామాపురం: రంజాన్, ఉగాది, జాతరలు, ఉరుసులు, విద్యార్థులకు పరీక్షల వేళల్లోనైనా గ్రామాలల్లో వీధి దీపాలు వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. అసలే మార్చి ఎండల తీవ్రత పెరుగుతోందని, దానికితోడు మరో వైపు రంజాన్ ఉపవాసాలు, నూతన తెలుగు సంవత్సరాది, ఆపై గంగనేరు మంచాలమ్మ జాతర, నీలకంఠ్రావుపేట దర్గా ఉరుసు మహోత్సవాలు, ఇంటర్, 10వ తరగతి ఇతర తరగతుల పరీక్షలు ఇదే మార్చి నెలలో జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో నల్లగుట్టపల్లె, మండల కేంద్రంలో ఇతరత్రా పంచాయతీలలో వీధి దీపాలు లేక విషపురుగులు సంచారం, మసీదుల్లో నమాజు వేళల్లో ప్రజలు అవస్థలను ఎదుర్కొంటున్నారు. గత కొద్ది సంవత్సరాల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. ఉపవాసాలలో భక్తులకు విద్యార్థులకు ఈ వీధి దీపాల వెలుగులు ఉపయోగం ఎంతో ఉపయోగదాయకమని ప్రజలు, విద్యార్థులు తెలియజేస్తున్నారు.

కళాశాలలో రంగోలి పోటీలు



ముగ్గులను వేస్తున్న విద్యార్థినులు

రాయచోటి జగదాంబసెంటర్: పట్టణంలోని చిత్తూరు మార్గంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళా సాధికారత విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్తంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా బాలికల కోసం రంగోలి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా.పి.హర్షలతాపంకజ్ ముఖ్య అతిథిగా హాజరై మహిళా శక్తిని ప్రోత్సహించేలా అలాంటి సృజనాత్మక కార్యక్రమాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యకర్త సమన్వయకర్త బి.శాంతకుమారి మాట్లాడుతూ విద్యార్థినుల కళాత్మక ప్రతిభను వెలికి తీయడమే ఈ పోటీ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని అందమైన రంగోలీలను ప్రదర్శించారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి: ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి రైతులను, ప్రజలను ఆదుకోవాలని లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం గుడ్లవారిపల్లిలో సర్పంచ్ వెంటనారాయణ రెడ్డి, మాజీ చైర్మన్ నరసింహారెడ్డిలు ఇచ్చిన విందు కార్యక్రమానికి స్థానిక ఎంపీపీ సుదర్శన్ రెడ్డితో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్‌లో రైతులు పూర్తిగా నష్టపోయారని వారికి అందాల్సిన పంట నష్టపరిహారం ప్రభుత్వం వెంటనే అందజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు: నేటి సమాజంలో విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలని శ్రీ అన్నమాచార్య అకాడమీ హైస్కూల్ కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్, డైరెక్టర్ మాడపూరి హేమలతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ ఆర్‌కే నాలెడ్జ్ వారు అబాకస్, వేదిక్ మ్యాథ్స్‌లలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీలలో శ్రీ అన్నమాచార్య అకాడమీ విద్యార్థులు వివిధ కేటగిరిలలో ఎం.సుబ్రమణ్యం, సివి తేజశ్రీ, ఎం.యశ్వంత్ ప్రథమ స్థానం, జోయా మెహెక్, జి.లక్షిత్ ద్వితీయస్థానాలలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ సమ్మెట ఉమా మహేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు



యర్రగుంట్లలో ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

సంబేపల్లె: మండల పరిధిలోని యర్రగుంట్ల సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రంలో 334 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి వుండగా ఇద్దరు విద్యార్థులు మాత్రం హాజరుకాలేదు. 332 మంది పరీక్షలు రాసినట్లు సంబంధిత చీఫ్ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రం వద్ద సంబేపల్లె పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లు

రైల్వేకోడూరు అర్బన్: అన్నమయ్య జిల్లాలోని ఆశ వర్కర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గంగాధర్ ఆధ్వర్యంలో శెట్టిగుంట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రభుత్వం రూ.26 వేలు జీతం అందించి మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ అలవెన్స్‌లు తక్షణం చెల్లించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఆశ వర్కర్ల పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. ఆశ వర్కర్ల విధులలో ఒత్తిడి పెంచకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.